# మేడ్ ఫర్ ఈచదర్

- తేజరా

నిట్టూర్పుతో చలం వ్రాసిన ఉత్తరాన్ని టేబుల్ మీద పడేసాడు రామనాథం.

ఒక్కసారి కళ్ళు మూసుకుని ఆలోచించాడు.

చలం ఉత్తరంలోని సారంశాన్ని నెమరు వేసుకున్నాడు.

"బాబాయ్... ఈసారైనా, ఎలాగైనా నీవే నాకు దారి చూపించాలి. లేకపోతే ఈ జన్మకింతే!"

అలా ఉత్తరం కేసి చూస్తూ రాజరాజేశ్వరిని, ఆమె కుటుంబాన్ని గురించిన ఆలోచనల్లోకి జారిపోయాడు రామనాథం.

పదెకరాల పొలం, పెద్ద లోగిలి, నలుగురు కొడుకులను, పెళ్లికెదిగిన ముగ్గురు కూతుళ్ళను, ఊళ్లో మంచి పేరు రాజేశ్వరికి వదిలి భర్త సీతారామయ్య అకస్మాత్తుగా కన్నుమూసాడు.

బంధువుల సహాయ సహకారాలతో ఆడపిల్లల పెళ్లిళ్ళు చేసింది రాజరాజేశ్వరి. మోహన్‌కి కూడా మంచి పిల్లని తెచ్చి పెళ్లి చేసింది.

ఆస్తి వ్యవహారాలు చక్కబెట్టుకుని, ఆడపిల్లల పెళ్లిళ్ళు చేయడంతో ఆమెలో ఆత్మస్థైర్యం పెరిగి అది అహంకారంగా రూపొందింది. ఇప్పుడు అతిశయంగా మాట్లాడడంలో ఆమెకు ఆమే సాటి అయింది. కోడల్ని ఒక్కసారి కూడా పుట్టింటికి పంపని అత్తగారుగా ఏనాడో పేరు పొందింది.

ఆమె ప్రవర్తనని తప్పు పట్టేవారు కానీ, ఆమెని ఎదిరించి మాట్లాడే వాళ్ళుకానీ ఆ బంధువర్గంలో లేరు.

రెండవ కొడుకు చలానికి పెళ్లి వయస్సు దాటి పోతున్నా కట్నంమీది ఆశతో మంచి సంబంధం కోసం ఎదురు చూస్తోంది రాజరాజేశ్వరి.

***

చలం: వయసు ముదిరిన బ్రహ్మచారి. ఓ మాదిరి ఉద్యోగస్తుడు. మంచి అందగాడు, తల్లి చాటు బిడ్డ.

నెమ్మదస్తుడైన చలం తల్లి మాటకు ఎదురాడ లేక సుమారు ఓ నలభై సంబంధాల వరకు చూసాడు. కానీ ఎన్నాళ్ళు? తల్లి ఆంతర్యం అతనికి అవగతమవలేదు.

తన ఈడు వాళ్లంతా భార్యాబిడ్డలతో హాయిగా ఉంటున్నారు. తనకా పెద్ద చెప్పుకోదగిన ఉద్యోగమేమీ కాదు. చెప్పుకోదగిన ఆస్తిపాస్తులు కూడా లేవు.

ఏం ఉందని? తల్లికి అంత కట్నం దురాశ? ఏమిటి దీనికి పరిష్కారం? ఆలోచిస్తున్న చలం మదిలో రామనాథం మెదిలాడు.

రామనాథం బాబాయి అంటే చలంకు ఎంతో అభిమానం. ఆయన సీతారామయ్యకు పిన్ని కొడుకు. ఎక్కడ ఎలా వాత పెట్టాలో తెలిసిన చతురుడు, లౌక్యం ముసుగులో హుందాగా వ్యవహారాలు చక్కబెట్టగలవాడు.

మరింక ఆలోచించకుండా కాగితం, కలం తీసుకుని తన బాధనంతా వివరిస్తూ రామనాధానికి ఉత్తరం వ్రాసాడు చలం.

***

గాయత్రి ఇంట్లో వాళ్లందరికీ సమస్య అయింది. మంచి ఉద్యోగం, చదువు ఉన్న గాయత్రికి అహంకారం, దర్పం కూడా చాలా ఎక్కువే.

ఉద్యోగం తెచ్చిన ఆత్మస్థైర్యంతో ఠీవిగా ఉండేదే కానీ ఆమె అందం ఆమెకు మైనస్ మార్కే. కానీ సమపాళ్లల్లో ఉండే అవయవ సౌష్టవం ఆమెది.

చదువని, ఉద్యోగమని, ఇంకా వయసు రాలేదని తండ్రి పరంధామయ్య, తల్లి పార్వతి పట్టించుకునేవారు కాదు.

పెళ్లంటే స్వేచ్ఛకు అడ్డు తెర అనీ, కట్నం ఇవ్వకూడదనీ, అత్తవారినీ, భర్తనీ చెప్పుచేతల్లో ఉంచుకోగలిగే ఉద్యోగం తనకుందనీ గాయత్రి అభిప్రాయం. ఇప్పుడు గాయత్రికి 30 ఏళ్ళ వయసు.

పరంధామయ్య గాయత్రికి సంబంధాలు వెతకడం ఆరంభించాడు. వెంటనే తన మిత్రుడు రామనాధంను కలిసి కట్నం పెద్దగా ఇచ్చుకోలేననీ, గాయత్రికి ఏదైనా సంబంధం చూడమనీ కోరాడు.

గాయత్రీ మనస్తత్వం, ప్రవర్తన చిన్ననాటి నుండీ ఎరిగి వున్న రామనాధం గుంభనంగా ఉండి పోయాడు.

మనసులో ఆలోచనలు... వాటిలో ఆరడుగుల అందమైన విగ్రహం, సుతిమెత్తని స్వభావం, తల్లి కొంగు వదలని మనస్తత్వం ఉన్న చలానికి, సామాన్యమైన అందం, కరకు స్వభావం, స్వతంత్ర భావాలుగల గాయత్రికి...

రామనాధం మనసులో అర్థమెటిక్ లెక్క చేస్తున్నాడు. ఒకరి సమస్య మరొకరికి ముడిపెట్టి ఆలోచిస్తున్నాడు. రెండు సమస్యలకు ఒకే పరిష్కారం.

దటీజ్ రామనాధం!

***

ఒక రకమైన సందడిగా ఉంది ఆ హాలు.

కానీ ఎవ్వరూ ఏమీ మాట్లాడడంలేదు.

రొటీన్‌గా అడిగే మామూలు ప్రశ్నలు వేసింది రాజరాజేశ్వరి.

సమాధానాలు చెప్పింది గాయత్రి.

గాయత్రిని చూచిన రాజరాజేశ్వరి ముఖంలో అసంతృప్తి.

ఎంతోమంది అమ్మాయిల్ని, ఇంతకంటే అందగత్తెలని చూసింది. వాళ్లే నచ్చని తనకు ఈ అమ్మాయి నచ్చుతుందా? ఏ విధమైన ప్రత్యేకతా లేని ఈ సంబంధాన్ని చేసుకోవడం ఏమంత సరైన పని?

రాజరాజేశ్వరి ఆలోచిస్తోంది.

'అమ్మ పేరు బంధువులలో బాగా మార్మోగిపోయిందేమో! ఏడాది నుండి ఎవ్వరూ పిల్లనిస్తామని తమ దగ్గరకు రావడంలేదు. ఇది ఇలాగే కొనసాగితే ఇక తనకు పెళ్లి గీత ఉండదేమో?' చలంలో అంతర్లీనంగా భయం, ఆందోళన.

నిర్లిప్తంగా చూస్తున్నాడు చలం.

"ఏరా ఏం చేయమంటావు? మీ అమ్మకు ఇష్టం లేనట్లుంది. నీ విషయం ఏమిటి?" నెమ్మదిగా అడిగాడు రామనాథం.

చలం ఆలోచనలో పడ్డాడు. అవసరం అతనిని మరోలా మాట్లాడేలా చేయలేకపోయింది.

ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా తల విదిలిస్తూ "ఎవరి ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేదు

బాబాయ్ం. నాకిష్టమే. నువ్వూ కానిచ్చేయ్ం'' అన్నాడు చలం.

రాజరాజేశ్వరి నిశ్చేష్టురాలై పోయింది. ఆమె కళ్ల ముందు చలం కొత్తవాడిలా కనిపిస్తున్నాడు. సరాసరి గాయత్రి దగ్గరకు వెళ్లాడు రామనాథం.

"చెప్పమా! నిస్సంకోచంగా నీ అభిప్రాయం చెప్పు'' అడిగాడు రామనాథం.

చలాన్ని చూసిన గాయత్రి మరేమనగలదు? తనకు అతడు కాకి ముక్కుకు దొండపండులా ఉంటాడు.

అత్తగారు గడ్డు అంటున్నారందరూ. తన తెలివితేటలతో ఆవిడ నోరు మూయించగలదు. ఆపాటి ధైర్యం తనకుంది. సరేనంది. నామమాత్రపు కట్నంతో చలం-గాయత్రీల పెళ్లి జరిగిపోయింది. వేదమంత్రాల మధ్య మంగళ వాయిద్యాల మధ్య గాయత్రి, చలం దంపతులయ్యారు.

అందమైన భార్య కావాలనుకున్న చలానికి అందంలేని గాయత్రి. స్వతంత్ర భావాలున్న గాయత్రికి, అహంకారియైన అత్త రాజరాజేశ్వరి.

హెచ్చు కట్నంతో అందమైన కోడలు రావాలనుకున్న రాజరాజేశ్వరికి, తక్కువ కట్నంతో సామాన్యమైన గాయత్రి. స్వతంత్ర భావాలు, ఆత్మాభిమానం హెచ్చుగావున్న గాయత్రికి-

అమ్మ కొంగు పట్టుకు తిరిగే భర్త చలం.

బంధువులందిర నోటా ఒకటే మాట...

మేడ్ ఫర్ ఈచదర్.

★

